# ఎవరి కోసం?

జానకిరామయ్యగారు రిటైరు అయ్యారట.

సుబ్బారావుకు ఉద్యోగం దొరికిందట.

ఆ ఊళ్లో చాలామంది నోట ఆ మాటలే వినిపిస్తున్నాయి.

"ఏమిటయ్యా, మూడవ ప్రపంచయుద్ధం ముంచుకు వచ్చిందనో, రష్యాకన్నా ముందుగా అమెరికా చంద్రమండలానికి మనిషిని పంపిందనో చెబుతున్నట్లు, అంత ప్రముఖ వార్తలా చెబుతున్నావు" అని మీరు నన్ను నిలదీస్తే నేను చెప్పలేను. నిజమే. దేశంలో ప్రతి రోజూ ఎంతమంది రిటైరు కావటంలేదు? ఎంతమందికి ఉద్యోగాలు దొరకటం లేదు? కాని, ఇది అన్నిచోట్లా జరిగినంత సహజంగా జరగలేదని నా అభిప్రాయం.

రెండు శుభకార్యాలు ఒక పందిట్లో చేస్తే ఉండే సందడే ఈ రెండింటికీ తటస్థించింది. ఇందులో వింతేమిటంటే, ఏ రోజు నుండి జానకిరామయ్యగారు ఆఫీసుకు పోనక్కరలేదో, అదే రోజు నుండి సుబ్బారావు ఉద్యోగం మొదలయింది.

ఊరిలోనే ఈ రెండింటినీ ఒకటిగా చేర్చి ఇంతలా చెప్పుకొంటుంటే ఇంట్లో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుందా మరి?

జానకిరామయ్యగారికి ఉదయం అయిదుగంటలకు లేచి, కాలకృత్యాలు నిర్వర్తించుకొని, స్నానం వగైరా పూర్తిచేసుకొని, అర్ధాంగి పెట్టే ఉడికీ ఉడకని కూరతో భోజనం అయిందనిపించుకొని, ఎనిమిదిన్నర కల్లా యూనివర్సిటీ గేటుదగ్గర బస్సు కోసం కాపలా కాయడం అలవాటు. అది ఈ నాటిదా? ఆయన ఉద్యోగంలో చేరిన రోజునుండి, ఈ ముప్పయిఏళ్ళ సర్వీసులోనూ క్రమం తప్పకుండా జరుగుతూ ఉన్న కార్యక్రమం.

అలవాటు చొప్పున 5 గంటలకల్లా మెలుకువ వచ్చింది. ఇంక పక్కమీద ఒక్కక్షణమైనా పడుకోవాలనిపించక లేచి కూర్చున్నారు జానకిరామయ్యగారు.

"అప్పుడే లేచి కూర్చున్నారేం? ఈ రోజు తొందరలేదుగా?" భార్యామణి సుప్రభాతం పలికింది.

ఆమె మాటకు జవాబు చెప్పకుండానే వీధి అరుగుమీద కూర్చుని దంత ధావన ముగించారు.

అప్పలమ్మ వీధి గుమ్మంలో కళ్లాపిజల్లి ముగ్గు పెట్టింది. ముగ్గు బుట్టా, చీపురుకట్టా కొట్టు గది తలుపువద్ద పెట్టి, వీధికొళాయి నుండి బిందెడు నీళ్ళు తెచ్చింది. పెరట్లో నుయ్యి పేరుకు ఉన్నదన్న మాటేగానీ, ఏప్రిలు నెల వచ్చేసరికే అది రాచ్చిప్ప అయి కూర్చుంటుంది. ఈ ఏడు లోతు చేయిద్దాము, ఆ ఏడు లోతు చేయిద్దాము అనుకొంటూనే పాతిక సంవత్సరాలు గడిపివేశారు జానకిరామయ్యగారు.

"ఆఁ! మీరు లోతు చేయించారు, నేను నీళ్ళు తోడుకున్నాను. ఈ ఏడో వచ్చే ఏడో రిటైరు అయి కూర్చుంటారు. ఇంక మీవల్ల ఏమవుతుంది? ఏమయినా చేయిస్తే, మా సుబ్బడే చేయించాలి" అనేది గర్వంగా కొడుకును చూసుకొంటూ కామాక్షమ్మ.

"బాబుగారూ, మీ తానానికి నీళ్ళెట్టాను" అన్నది అప్పలమ్మ.

దానిమాట పూర్తిగా వినవలసిన అవసరమేలేదు జానకిరామయ్యగారికి. అది "బాబుగారూ" అంటే, అతని స్నానానికి వేళయిందన్న మాట.

దండెంపై వేళ్ళాడుతున్న తుండుగుడ్డ తీసుకొని పెరట్లోకి వెళ్లారు. నూతి చపటామీద బిందెతో నీళ్లు, చెంబు, పీట సిద్ధంగా ఉన్నాయి. రెండు చెంబుల నీళ్ళు బుర్రపై పోసుకొని, ఒళ్ళు తడిబట్టతో రుద్దుకొంటున్నారు.

"అప్పలమ్మా, నీళ్ళు ఎక్కడ పెట్టావే?" కోడలుపిల్ల కంఠం కొంచెం గట్టిగానే వినిపించింది.

"పెదబాబుగారి తానానికి పెట్టానమ్మా."

"నీకు బుద్ధి ఏ కోశానా లేదే. అర్జంటుగా నీళ్ళు కావాలని నేను చెబితే, అక్కడ తగలేశావా? మళ్ళీ గంటకి కాని కొళాయిదగ్గర నీళ్లు పుట్టవుకదా?"

"రోజూ నేను తెచ్చే మొదటి బిందె బాబుగారి తానానికే కదమ్మా పెట్టమంటారు?"

"రోజూ అయితే ఆయన తొందరగా వెళ్ళిపోవాలి కాబట్టి, తెల్లవారకుండా స్నానం చేసేవారు. ఈ రోజేం చేస్తారూ? పనా, పాటా? ఇంట్లో కూర్చోవడమే కదా?"

"బాబుగారి ఉద్యోగం?" అప్పలమ్మ ప్రశ్న ఆత్రుతగా వినిపించింది.

"రిటైరు అయిపోయారే. ఇంక ఆర్జనలేదు. ఇంత తింటూ ఇంట్లో కూర్చోవడమే."

ఇంక ఆయనకు స్నానం చెయ్యబుద్ధికాలేదు. గబగబా ఒళ్ళు తుడుచుకొని లోపలికి వచ్చేశారు.

"భారతీ, ఇంకా బిందెకు సగం నీళ్ళున్నాయి. నీ కెందుకైనా అవసరం అయితే తీసుకో అమ్మా, నా స్నానం అయిపోయింది" అన్నారు కోడలుతో.

"అరబిందెడు నీళ్ళు నేనేం చేసుకొనేది? ఆయన స్నానానికి నీళ్ళు కావాలంటున్నారు. పది గంటలకల్లా ఆఫీసులో ఉండాలట. రెండు కోసుల దూరం పోవాలాయెను. పైగా అక్కడ బస్సుకోసం పడిగాపులు ఉండనే ఉన్నాయి." భారతి మెల్లగా మాటలు విడిచింది.

'ఉదయాన్నే బస్సుకోసం పడిగాపులు కాచి, రెండుకోసుల దూరంపోయి నిన్నటిదాకా తనూ నౌకరీ చేశాడు. అయినా ఎవరికీ ఆ చింత ఉండేదికాదు. ఈ రోజు.....' జానకిరామయ్యగారి మనసు చికాకు పడింది.

◆ ◆ ◆

"తాతయ్యా, నాన్నమ్మ వంట అయిపోయింది" అన్నది చిట్టి, చేతులు పట్టుకు లాగుతూ.

"పదమ్మా, పద. నేనూ ఇప్పుడే వస్తున్నాను. ఈ అష్టోత్తరం కాస్త పూర్తి చేసి వచ్చేస్తాను" అన్నారు జానకిరామయ్యగారు.

మనమరాలు చిట్టి తొమ్మిదింటికల్లా స్కూలుకు పోవాలి. రోజూ తాతయ్యా, మనుమరాలూ సహపంక్తి భోజనాలు చేస్తారు. తాతయ్యతో పాటు తనూ ముఖానికి ఇంత విభూతి రాసుకొని, ముక్కు పట్టుకొని "భూం భూం" అంటుంది చిట్టి.

వంట ఇంటి గడపలో రెండు కంచాలు, పీటలు పెట్టి ఉన్నాయి.

"తాతయ్యా! పెద్దకంచం నీది, చిన్నకంచం నాది" రోజూ వంతులు వేస్తుంది చిట్టి.

"అయ్యో రామ! మీ రొచ్చి కూర్చున్నారేమండీ? ఆఫీసుకి వేళయిపోతున్న దంటున్నాడు. ఇంకా అప్పలమ్మ కంచాలు తోమియ్యలేదు. ఈ రోజేం తొందర లేదు కదా? అరగంట ఆగి తింటే తప్పా?" కామాక్షమ్మ కంఠం విసుగుదలతో వినిపించింది.

ఒకసారి విస్తరి ముందు కూర్చుని లేవడం ఆయనకు అలవాటు లేదు. పెట్టిందేదో మౌనంగా తింటున్నారు.

"ఈ ఇంట్లో ఉన్నది మనుషులా, పశువులా? పది గంటలకల్లా ఆఫీసులో ఉండాలి. తలమ్ముకొన్న బతుకు అని చెబితే జ్ఞానం ఉండక్కర్లే?" భార్యపై విసుక్కొంటున్నాడు సుబ్బారావు.

కలుపుకొన్న మజ్జిగ అన్నం వెనక్కు నెట్టి ఔపోసన పట్టి లేచిపోయారు జానకిరామయ్యగారు.

"తాతయ్యా, అన్నం అలా పారేశావేం? ఒంట్లో బాగా లేదా?" చిట్టి సానుభూతిగా ప్రశ్నించింది.

"ఒంట్లో సరిగానే ఉందమ్మా. ఆకలి వెయ్యలేదు" అన్నాడు.

"అమ్మా, నాకూ ఆకలిగాలేదే. కొంచెం అన్నం విడిచిపెట్టనా?" తల్లి అనుజ్ఞ అడిగింది చిట్టి.

"బియ్యం కొనలేకుండా ఉన్నాము. కంచంలో పెట్టిన అన్నం పారేసుకొంటే ఎలా? వండి పారబోసుకోడానికి ఇంట్లో ధనరాసులేమీ మూలగడం లేదు" కూతురిని కసిరింది భారతి.

కోడలు మందలింపు జానకిరామయ్యగారికి చెంపన ఛెళ్లున తగిలింది. గోడవారన ఉన్న చెప్పులు తొడుక్కొని, కండువా కోసం బట్టల స్టాండువైపు చూశారు. అక్కడ సుబ్బడి పాంటూ, షర్టూ, బెల్టూ వగైరా ఉన్నాయి. అతని కండువా కావడి పెట్టెమీద ఉమ్మచుట్టి పడేసి ఉన్నది. ఏదో అనబోయి ఊరుకొన్నారు. కండువ మడతలు సరిచేసుకొని భుజం మీద వేసుకొన్నారు.

గుమ్మం దిగుతుంటే చిట్టి వచ్చింది. "తాతయ్యా, బస్సుదాక నేనూ వస్తాను, ఇంకా మా స్కూలుకి వేళకాలేదు" అన్నది.

"తెల్లారకుండా ఎక్కడకండీ ఆ పరుగులు? కాస్త పొద్దెక్కిపోతే మార్కెట్టు నుంచి కూరయినా తేవచ్చుకదా? రోజూ సుబ్బడు తెస్తున్నాడు. ఈ రోజు వాడి కెక్కడ తీరుతుంది?" అన్నది కామాక్షమ్మ.

తొడుక్కొన్న చెప్పులు గోడవారకు విసిరి చావిట్లో బల్లమీద కూర్చున్నారు.

"తాతయ్యా, ఆఫీసుకి పోవా?" మనుమరాలు తొందరచేసింది.

"పోనమ్మా. ఈ రోజు నాకు పనిలేదు." ఏదో వ్యథ గొంతుకలో గురగుర లాడింది.

"చక్కా నీకే మంచిది. హాయిగా ఇంట్లో కూర్చోవచ్చు. నా కయితే బోలెడు పనుంది. మా టీచరు ఏడెక్కాలు వ్రాసుకు రమ్మంది. ఈ రోజు చాలా లెక్కలు చెబుతారట" అన్నది చిట్టి.

తాతయ్య జవాబు ఇవ్వకపోవడం చూసి "మరి నేను పోతాను తాతయ్యా, హాయిగా ఇంట్లో కూర్చో" అని పరుగుతీసింది చిట్టి.

◆ ◆ ◆

అరగంట గడిచింది. ఇంట్లో యుద్ధం సద్దుమణిగింది. సుబ్బారావు ఆఫీసుకు వెళ్లేందుకు తయారు అయ్యాడు.

"వెళ్లి వస్తాను భారతీ" అన్నాడు భార్యతో.

"ఉదయమనగా తినిపోతున్నారు. రెండుగంటల వేళ కాస్త కాఫీ అది తీసుకోండి." భర్త ఆకలితో ఉండిపోతాడేమో అన్న బెంగ ఆమె మాటల్లో ధ్వనించింది.

"డబ్బు తెచ్చి పెడుతున్నన్నాళ్లూ ఆడవాళ్లు చూపే ఆప్యాయతకు అంతు ఉండదు." తనలో తనే గొణుక్కొన్నారు జానకిరామయ్యగారు.

"నేను వెళ్తున్నాను నాన్నా" వీధి గుమ్మంలో తండ్రితో అన్నాడు సుబ్బారావు.

"మంచిది నాయనా, శుభం" అన్నారు.

"మీరీ రోజు ఇంట్లోనేకదూ ఉంటారు? కొంచెం ఆ రాజుగాడి సంగతి చూడండి. మరీ ఎందుకూ పనికిరాకుండా తయారవుతున్నాడు." బాధ్యతను గుర్తుచేశాడు తనయుడు.

కూరల సంచి పట్టుకొని బజారుకు బయలుదేరారు జానకిరామయ్యగారు. దోవలో కనిపించాడు చిన్నయ్యసెట్టి. "బాబుగారూ, నా బాకీ కొంచెం చెల్లు బెట్టాలి. పిల్లకి పెళ్లి చెయ్యాలనుకొంటున్నాను" అన్నాడు.

"అలాగే చిన్నయ్యా, వచ్చేనెలలో అంతా సర్దుబాటు చేస్తాను" అన్నారు.

"తమరు అలా సెలవిస్తే ఎలా బాబూ? ఏదైనా చెల్లుబెడితే ఈ నెల్లోనే పెట్టాలి. తమరు పింఛను పుచ్చుకొన్నారట కదా" అన్నాడు. వచ్చే నెలలో అప్పు తీర్చేందుకు నీ దగ్గర సొమ్ముండి ఏడుస్తుందా అని తనను ఆక్షేపిస్తున్నట్లు బాధపడ్డారు జానకిరామయ్యగారు.

"అలాగే లేవోయ్. రేపు మా ఇంటికి రా చూద్దాము" అన్నారు.

కూరలు కొనుక్కుని వస్తూంటే జ్ఞాపకం వచ్చింది, ఆ వారంలోనే చిట్టి పుట్టినరోజు వస్తున్నదని. రంగయ్య కొట్టులో రెండుగజాలు చీటీగుడ్డ తీసుకొందామని అడుగుపెట్టారు.

జానకిరామయ్యగారు అతని పాత ఖాతాదారు. కార్యాలకు, కథలకు, మంచికి, చెడుకు అన్నిటికీ అతనిదగ్గరే బట్టలు కొంటారు. వీలు చూచుకొని అప్పుడు కొంత, అప్పుడు కొంత బాకీ తీరుస్తుంటారు.

"రండి బాబుగారూ! రండి రండి" అని ఆహ్వానించాడు రంగయ్య.

"ఏం రంగన్నా, బాగున్నావా?" కుశల ప్రశ్న వేశారు జానకిరామయ్యగారు.

"ఆఁ, అదే బాగు. ఏటి బాబుగారూ, ఇలా దయచేసినారు? ఈ యేల ఆఫీసుకి పోలేదా?" అన్నాడు.

"ఊఁ" అన్నారు జానకిరామయ్యగారు ముక్తసరిగా.

"అవును మరిచిపోయాను. మీరు పింఛను పుచ్చుకొన్నారట కదా? నిన్న మా బావమరది చెప్పినాడు. "ఆరి కుర్రాడి కేదో ఉద్యోగం అయిందట ఇంక ఆరి అబ్బాయే ఇల్లు తిప్పాల అన్నాడు."

అతని మాట పూర్తి కాకుండానే వచ్చాడు కేశవయ్య.

"ఏమండోయ్ జానకిరామయ్యగారూ! ఏమిటి విశేషాలు?" అన్నాడు.

"ఏమున్నాయి కేశవయ్యా?"

"ఏమోయ్ రంగన్నా, వ్యాపారం బాగా సాగుతున్నదా?" అన్నాడు కేశవయ్య.

"ఏం బాగో బాబూ. అరువుల్లో సొమ్ము వసూలు కాలేదు. విడిపించుకోవలసిన సరుకు స్టేషనులో పడి మూలుగుతున్నది" అన్నాడు నిస్పృహగా.

'రంగయ్య తెలివిగా ముందర కాళ్ళకు బంధంవేశాడు" అనుకొన్నారు జానకి రామయ్యగారు.

కేశవయ్య తనకు కావలసిన రవికల గుడ్డ తీసుకొన్నాడు. "వెళ్దామా, మీ రేమయినా కొనాలా?" అని ప్రశ్నించాడు.

"అబ్బే కొనేందు కేమీ లేదు. ఊరికే రంగయ్యని చూసిపోదామని వచ్చాను. పదండి" అన్నారు తనూ కాలు కదుపుతూ.

ఇద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకొంటూ నడక సాగిస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలి దగ్గరికి చేరేసరికీ ఎదురుపడింది ఒక యాచకుల గుంపు. యాచకులంటే ముష్టివాళ్ళు కాదు. "అనాథాశ్రమం చందాలు, అగ్ని బాధితుల చందాలు" అంటూ పీక్కుతినే సంఘసేవకుల సముదాయం.

"తరువాత రండి" అన్నారు జానకిరామయ్యగారు.

"మీ కోసం ఇంతదూరం వచ్చామండి. ఏదో తమకు తోచింది ఇచ్చి పంపండి. ఇంతవరకు తమ దగ్గరికి వచ్చి వట్టి చేతులతో పోలేదు." అలవాటు పడిన మాటలను అప్పగించారు వాళ్ళు.

"మళ్ళీ రమ్మంటే మీకు కాదటయ్యా? ఇదివరలో ఇచ్చేవారంటే ఆర్జన ఉండేది; ఇచ్చేవారు. ఇప్పుడిచ్చేందుకు ఆయనదగ్గర ఏముందయ్యా? వెళ్ళి వాళ్ల అబ్బాయిని అడగండి" అన్నాడు కేశవయ్య.

జానకిరామయ్యగారి అహం దెబ్బతింది. జేబులో చెయ్యిపెట్టి, ఉన్న ఒక్క అయిదు రూపాయల నోటూ వాళ్ల చేతిలో పెట్టారు.

"పుచ్చిన మిరియాలయినా, జొన్నలకన్న నయం" అంటూ కేశవయ్య వైపు వ్యతికరణగా చూస్తూ వెళ్లిపోయారు వాళ్ళు.

ముందు రోజు జీతం సొమ్ము సందుగ పెట్టెలో పెట్టమని భార్యకు ఇస్తూ ఒక నోటు మాత్రం తనజేబులో వేసుకొన్నారు. ఆ నోటు తన పరువు నిలబెట్టిందనుకొన్నారు జానకిరామయ్యగారు.

◆ ◆ ◆

ఇంట్లో కాలు పెడుతుంటే "సరోజ ఉత్తరం వ్రాసిందండీ" అన్నది కామాక్షమ్మ.

"ఏమంటుందేమిటి?" అన్నారు పై మీది కండువని వంకెకు తగిలిస్తూ.

"ఏమంటుంది? పెద్దవాళ్ళిద్దరూ ఆకతాయిగా తయారవుతున్నారట. "మీ అల్లుడికి పొద్దల్లా ఆఫీసు పనితోనే సరిపోతుంది, నాకు చంటిముండ చెయ్యి దిగదు. మీరిప్పుడు ఖాళీగా ఉన్నారుకదా? కొన్నాళ్లు నా దగ్గరికి వచ్చి ఉండకూడదా?' అంటుంది. 'మీకు స్థలం మార్పు ఉంటుంది, నా పిల్లలకు ఓ అక్షరం, ముక్కా వస్తుంది' అని వ్రాసింది" అన్నది కామాక్షమ్మ.

"మంచిదే. ఉద్యోగం, సద్యోగంలేని తండ్రికి మంచి ఉద్యోగమే చూపించింది నీ కూతురు" అన్నారు అదోలా నవ్వుతూ.

"మీతో ఏ మాటన్నా మరీ రాద్ధాంతమండీ. ఏదో నాలుగు రోజుల పాటు ఆ మిషతోనన్నా తన దగ్గరుంటారనే ఆశతో వ్రాసింది కానీ, ఆ మాత్రం దాని పిల్లలకు చదువు చెప్పేవారు దొరకరనా?" కూతురును వెనకేసుకు వచ్చింది కామాక్షమ్మ.

చిట్టి స్కూలు నుండి వచ్చింది.

"తాతయ్యా! ఓ పావలా ఇయ్యవూ, ఐస్‌క్రీమ్ కొనుక్కుంటాను" అన్నది.

"ఇప్పుడే కదా పాలు తాగావు? కొంతసేపుపోయాక కొనుక్కొందువు గానిలే" అన్నారు.

"అది కాదు తాతయ్యా. పక్కింటి రాము, సుందరి అందరూ తింటున్నారు. నాక్కూడా కావాలి, తాతయ్యా ఒక్క పావలా తాతయ్యా" చిట్టి ఒకటే గోల చేస్తున్నది.

"ఏమిటే, చెబుతుంటే వినిపించుకోకుండా ఆ కాకిగోల? నీ కిచ్చేందుకు తాతయ్యదగ్గర డబ్బులెక్కడున్నాయి? పోయి మీ అమ్మని అడుగు" మనుమ రాలిని కసిరింది కామాక్షమ్మ.

అర్ధాంగి తన అసమర్థతను ఎత్తి చూపినట్లు అనిపించింది జానకిరామయ్యగారికి. మనుమరాలికి పావలా డబ్బు లిచ్చేందుకు తనకు ఆర్థిక స్తోమత లేదా? అతనిలో ఉక్రోషం ఉప్పెనగా లేచింది. జేబులో పెట్టిన చెయ్యి ఖాళీగా తిరిగివచ్చింది. ఉన్న సొమ్మంతా అనాథ శరణాలయం వాళ్ళకు ఇచ్చివేసిన సంగతి జ్ఞాపకం వచ్చింది.

"ఉండమ్మా చిట్టీ, ఇప్పుడే ఇస్తాను" అంటూ గదిలో సందుగ పెట్టె దగ్గరికి వెళ్లారు.

'తన నెల్లాళ్ల కష్టార్జితం ఇంకా అందులో ఉంది. తన మనుమరాలికి తను ఇవ్వదలుచుకొన్నంత ఇస్తాడు. తనకేం డబ్బులేదా' అనుకొంటూ ముందుకు వంగారు జానకిరామయ్యగారు.

పెట్టెకు వేసి ఉన్న తాళం అతన్ని పరిహసించింది.

"కామాక్షీ" అతని కంఠం కోపంతో వణికిపోయింది.

"ఏమిటండీ ఆ గావు కేకలు?" ఆయనకన్నా గట్టిగానే అరుస్తూ గదిలోకి వచ్చింది కామాక్షమ్మ.

"ఈ పెట్టెకు తాళం వెయ్యడం ఎప్పటినుండి?" ఆ ప్రశ్నలో వ్యంగ్యం తొణికిసలాడుతున్నది.

"అబ్బాయి వెయ్యమన్నాడట. భారతి వేసింది" అన్నది ఆవిడ.

"అదే. ఎందుకు వెయ్యవలసి వచ్చింది అనే నా ప్రశ్న. నా జీవితంలో ఇంతవరకూ రాత్రిపూట గదికి తాళం వెయ్యడమే కాని, పెట్టెకు తాళం పెట్టలేదు. ఈ రోజు ఈ మార్పు ఎందుకు రావాలి?" అధికారయుతంగానే పలికింది అతని కంఠం.

"బాగుంది. ఉన్నకాస్త సొమ్మూ నడిరోడ్డు మీద పెట్టుకొంటే ఇంక ఇల్లు బాగుపడినట్లే. ఎవరు ఖర్చుపెట్టారో, ఎంతఖర్చు పెట్టారో ఒక లెక్కా పత్రం ఉండాలా? అక్కరలేదా? మీ అబ్బాయి వెయ్యమంటేనే వేశాను. మీ సొమ్ము కావలిస్తే తీసుకోండి. ఆ పెట్టెకుమాత్రం తాళం వేసే ఉండాలి" అన్నది భారతి సన్న సన్నగా.

"ఇరవై ఏళ్లుగా లేని లెక్కాపత్రాలు నీ కొడుక్కు ఈ రోజు కావలసి వచ్చాయన్న మాట" అన్నారు కామాక్షమ్మతో.

"బాగుందండీ. నన్నంటే నాకేం తెలుస్తుంది? రేపటి నుండి బరువు బాధ్యతలు మోయవలసినవాడు వాడే కదా" అన్నది ఆమె.

"పదమ్మా చిట్టీ, నా దగ్గర డబ్బులు లేవు. పోయి ఆడుకో" అన్నారు.

తాతయ్యను ఆ పరిస్థితుల్లో ఎన్నడూ చూడని చిట్టి బెంగపడింది.

"పోనీలే తాతయ్యా. ఐస్‌క్రీమ్ వాడు వెళ్ళిపోయాడు. రేపు కొనుక్కొంటాలే" అని తాతను సమాధాన పెట్టింది.

◆ ◆ ◆

వీధి అరుగుమీద చాపపై నడ్డి వాల్చారు జానకిరామయ్యగారు. సాయంకాలం నాలుగు గంటలు కావస్తున్నది. కంచు గ్లాసులో మజ్జిగ తేట పోసి పట్టుకు వచ్చింది కామాక్షమ్మ. ఆమె రాక గమనించి కూడా ఆయన మాట్లాడలేదు.

"కాస్త దాహం పుచ్చుకొంటారేమిటి?" అన్నది.

"అంటే?" అర్థం కానట్లే ప్రశ్నించారు.

"పంచదార, కాఫీగుండ చాలా ప్రియంగా ఉన్నాయి. యింట్లో ఇంక రెండవపూట కాఫీలు వద్దన్నాడు పెద్దాడు. ఏదో ఒకటి తాగడం మీకు అలవాటు కదా అని, మజ్జిగతేట తెచ్చాను" అన్నది కామాక్షమ్మ.

ఆయన అదోలా నవ్వుతూ "ఇన్ని సంవత్సరాల నా సాహచర్యంలో నేను మజ్జిగతేట తాగటం ఎప్పుడయినా చూశావా కామాక్షీ?" అన్నారు. ఆమె మాట్లాడలేదు.

"అక్కరలేదు. ఉంచు, రాత్రి భోజనాలలోకి పనికివస్తుంది" అన్నారు.

ఆమె ఇంకా అక్కడే నించుంది.

ఆయన గోడవైపు తిరిగి పడుకొన్నారు.

ఆరు గంటలయింది. ఇంకా పేపరు కుర్రాడు రాలేదు.

"బహుశా ఈ రోజు నుండి వద్దని చెప్పి ఉంటారు. లేకపోతే ఈసరికి తేవలసిందే" అనుకొన్నారు.

సుబ్బావధానిగారు గుమ్మంలో నించున్నారు.

"రండి రండి" అన్నారు జానకిరామయ్యగారు.

"అలా పార్కుదాకా పోయివద్దాము, రండి" అన్నారు అవధానిగారు.

"ఎక్కడికీ కదలాలని లేదండీ."

"ఉదయం నుండి ఇంట్లోనేగా కూర్చున్నారు? పదండి. కాస్త కాలుజాడించి వస్తే, ఒంటికి మంచిది" అన్నారు.

"పదండి" అంటూ తలకింద ఉన్న తుండుగుడ్డ దులిపి భుజంపై వేసుకొంటూ, వీధిలోకి వచ్చారు జానకిరామయ్యగారు.

◆ ◆ ◆

కను చీకటి పడుతుండగా ఇద్దరూ తిరిగి వచ్చారు. గుమ్మం ఎక్కిన జానకిరామయ్యగారు "మళ్లీ రేపు కలుద్దామండీ. నమస్కారం" అని అవధాని గారిని సాగనంపి చావిట్లోకి వచ్చారు.

"మీ కెక్కడినుండో రిజిష్టరీ ఉత్తరం వచ్చిందండీ" అంది కామాక్షమ్మ.

నిర్లిప్తంగా ఆమె చేతిలోని కవరు అందుకున్నారు. పక్కన ఉన్న హరికేను లాంతరు ఎత్తి పట్టుకొంది ఆమె.

చదవడం పూర్తిచేసి మళ్ళీ కవరులో పెట్టారు జానకిరామయ్యగారు.

"ఎక్కడనుంచేమిటి?" కామాక్షమ్మ ప్రశ్నించింది.

"నీకు సంబంధించింది కాదు" జవాబు చెప్పారు. ఆమె దీపాన్ని గజానికి తగిల్చి వెళ్లిపోయింది.

అది అతని ఉద్యోగ కాలాన్ని మరి రెండు సంవత్సరాలు పొడిగిస్తూ, అధికారులు పంపిన తాఖీదు. పోస్టువారి దయాధర్మంవల్ల, అలవాటు చొప్పున ఆరు రోజులు ఆలస్యంగా చేరింది. తలుచుకొంటే మరి కొంతకాలం తను ఆర్జించగలడు. కాని, ఎవరికోసం ఆర్జించాలి? ఈ వర్తమానం సకాలంలో అంది ఉంటే ఈ ఆలోచనే వచ్చేది కాదు. కాని ఈనాడు ఆలోచించకుండా ఉండలేకపోయాడు.

ఇన్నేళ్ళపాటు తన రక్త మాంసాలను డబ్బుగా మార్చి భార్యాబిడ్డలను పోషించాడు. ఆదర్శాలను ఆవలికి నెట్టి అవమానాలను సహిస్తూ ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని పాటుపడ్డాడు. తన ఒక గుప్పెడు పొట్టనింపుకొనేందుకు ఇంత పరిశ్రమించాలా? ఇన్ని అన్యాయాలు చెయ్యాలా? ఎవరి బాగుకోసం తాను ఇంతగా పరిశ్రమించి, ఇంత నైచ్యానికి గురయి జీవితం గడుపుతూ వచ్చాడో, ఆ భార్యాబిడ్డలు తనపట్ల చూపుతున్న ఆప్యాయత, తన సంపాదన సన్నగిల్లిందని తెలియగానే తనకు చూపుతున్న ఆదరం తెలుసుకొన్న మీదట, ఇంకా తను ఉద్యోగం చెయ్యవలసిన అవసరం ఉందా?

లేదు. అక్కరలేదు. వారికి కావలసింది డబ్బు. మనిషి విలువను డబ్బుతోనే వారు కొనగలరు. 'మనిషిని మనిషిగా గౌరవించలేని వీరి కోసం తను కష్టించబోవడంలేదు.' దృఢంగా తీర్మానించుకొన్నారు జానకిరామయ్యగారు.

చేతిలోని కాగితాన్ని ఉండగా చుట్టి వీధిలోకి విసిరివేశారు. ఎదురుగా వస్తున్న చిట్టికి తగిలింది ఆ కాగితం.

"బలే, తాతయ్యా! నన్ను కొడుతున్నావేంటి?" అంటూ అతని దగ్గరికి వచ్చింది చిట్టి.

తాతయ్య ఎప్పటిలా తనను నవ్వుతూ చేతుల్లోకి తీసుకోలేదు. ఆ దీపపు క్రీనీడలో అతని ముఖం వాడి ఉండడం ఆ పిల్ల గ్రహించింది.

తాతయ్య మధ్యాహ్నం తనదగ్గర డబ్బులు లేవన్నాడు. అందుకే సరిగా లేడనుకొంది. గబగబాపోయి, తాను దాచుకొన్న పది నయాపైసల నాణెం తెచ్చింది.

దానిని ఆయన చేతిలోపెడుతూ, "తాతయ్యా, నీకు డబ్బులేకపోతే ఏం? నా దగ్గర ఉంది. ఇంద, తీసుకో. నాకు లేకపోయినప్పుడు నువ్వు ఇవ్వలా? ఇప్పుడు నేను ఇస్తాను" అంది.

ఆమె మాటలతో ఆ వృద్ధుని కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఏడవకు తాతయ్యా, అమ్మ కొనుక్కొందుకు డబ్బులిస్తుందిగా అదంతా నీకే ఇచ్చేస్తాను" అంది.

"నా బంగారు తల్లే" అంటూ చిట్టిని చేతుల్లోకి తీసుకొన్నారు జానకిరామయ్యగారు.

"తాతయ్యా, తాతయ్యా. ఈ రోజు లెక్కల్లో నాకు పదిమార్కులు వచ్చాయి. నావన్నీ రైటే. నేను బాగా చదువుకొని, పెద్ద దాన్నయి ఉద్యోగం చేస్తాను. ఇన్ని రూపాయలు జీతము తెచ్చి అంతా నీకే యిచ్చేస్తాను" అంది ఆయన కన్నీటిని తన చిన్న ఫ్రాకుతో తుడుస్తూ.

"అలాగేనమ్మా చిట్టీ, మరి ఏడవను. నీలాంటి బంగారుతల్లి ఉండగా నాకు కొదవేమిటమ్మా" అన్నారు.

తాతయ్యకు ఈ బుగ్గా ఆ బుగ్గా రెండుముద్దులిచ్చి, ఒడిలోనుంచి దిగిపోయింది చిట్టి.

చిట్టి చేతిలోని కాగితాన్ని సాపుచేసి కవర్లో ఉంచి, పదిలంగా జేబులో పెట్టుకొన్నారు జానకిరామయ్యగారు.